కార్టూన్

నువ్వు జీవితాన్ని సీరియస్‌గా తీసుకోకపోవచ్చు. కానీ జీవితం మాత్రం నీ ప్రతి చర్యను సీరియస్‌గానే తీసుకుంటుంది. అందుకు నిదర్శనం - ఇదిగో ఈ రామనాథోదంతం!

రామనాథం దృష్టిలో ప్రపంచ మనగా అదొక అమ్యూజ్‌మెంట్ పార్కు. జీవిత మనగా అదొక క్రీడ. తోటి మానవులు వినోద సాధనాలు. రామనాథం నిఘంటువులో స్నేహితులన్న పదానికి నిర్వచనం - ఆడుకున్నంతసేపు ఆడుకుని విసుగు పుట్టగానే, లేదా బెడిసి కొట్టగానే విడిచి పెట్టవలసిన ఆట వస్తువులు. ఈ వైఖరివల్ల రామనాథానికి కుదిరినవన్నీ తాత్కాలికమైనా ఆశ్రయాలు. ఏర్పడినవన్నీ తాత్కాలికమైన స్నేహాలు.

పైన పేర్కొన్న ఆనవాయితీకి విరుద్ధంగా నిండుగా ఒక్క సంవత్సరం పాటు రామనాథానికి స్నేహితుడుగా వుండగలిగినవాడు. మీదు మిక్కిలి రూంమేటుగానే మిగిలినవాడు చలపతి ఒక్కడే! భగవంతుడు తమకేవో సుమారుపాటి తెలివి తేటల్ని మాత్రం ప్రసాదించాడనీ, జీవితం సాఫీగా సాగిపోవడానికి ఈ మాత్రం తెలివి తేటలే చాలుననీ భావించే అల్ప సంఖ్యాక మానవానీకంలో చలపతి ఒక్కడు. ఇతరులకు తాను సేగి తలపెట్టకపోతే, వారుగూడా తనకు అపకారం తలపెట్టరన్న ఉష్ట్రపక్షి మనస్తత్వం అతనిది! చలపతి హృదయం విశాలమైనదే! కానీ లోతు తక్కువ. పైగా స్వచ్ఛమైన నీరేమో, అందులో ఏ మాత్రం గుండుసూది లాంటి వస్తువు పడివున్నా అది బాహాటంగా లోకులకు కనిపించిపోతుండేది. ఆశలతో ఆవేశాలతో నిండిన ఆంతరంగిక జీవనం ఇలా బట్టబయలు వ్యవహారమై పోవడంవల్ల చలపతి మిత్రుల కులాసా కాలక్షేపానికి కొక ముడి వస్తువుగా ఉపకరించేవాడు.

"ఒరే అబ్బీ, ఇటీవల ఒక రోజున చలపతి ఏం చేశాడో తెలుసా..." అంటూ ప్రారంభించేవాడు, రామనాథం. "తన ఊహా సుందరి కొక ప్రణయ లేఖ వ్రాశాడు. ఆ లేఖ ఆద్యంతాలూ దివ్యంగా కుదిరిందని నాకు చూపెట్టాడు. పోస్టు చేసేయ మన్నాను. ఎలా చేయను బాబూ అంటూ దిగులు ముఖం పెట్టాడు. పదిహేను పైసలు నీవి కావనుకుంటే సరి. పోస్టాఫీసులో కవరు దొరుకుతుంది అన్నాను. పైసలేం కర్మ, పదిహేను రూపాయలైనా పెట్టుకోగలను కానీ, నా కావిడ చిరునామా తెలియదే" అన్నాడు.

"చిరునామా తెలిసిన వారికి బహుమానం - అంటూ ఒక ప్రకటన వేయించేయగూడదూ!" ఇంకొక మిత్రుడు సాగదీసేవాడు.

"అందుకైనా కనీసం పేరు తెలిసి వుండాలి గదా! ఆ పేరును గురించి గూడా చలపతి కొక నిర్దిష్టమైన అభిప్రాయ మున్నట్టు తోచదు. ఒకసారి సురేఖ అంటారు. ఇంకొకసారి జలజ అంటాడు. మరొకసారి 'లీలా పద్మిని' అయితే బాగుంటుందంటాడు. అలాగే గిరిక, పూర్ణిమ, కిరణ్మయి మొదలుగాగల వెయ్యి పేర్లలో తన ప్రియురాలి నామధేయమేమిటో నికరంగా చెప్పలేదు!"

"అయ్యోపాపం! గొప్ప చిక్కే!" ఒక మిత్రుడి సానుభూతి.

"పోనీ ఎత్తు, లావు, పుట్టు మచ్చలు లాంటి ఆనవాళ్ళు తెలిపితే ఆచూకీ తెలియ వచ్చుకదా!" ఇంకొక మిత్రుడి సలహా.

"పుట్టుమచ్చలకేం భాగ్యం; తన ప్రియురాలి ఆకారాన్ని గురించి మాత్రం చలపతికి కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. ఆవిడ కళ్ళు నీలోత్పలాలట. చెవులు శ్రీకారాలట. ముక్కు సంపెంగ పువ్వు. బాహువులు తామరతూళ్ళు. జడ జానువులదాకా వ్రేలాడుతుంది. ఇంకా వృక్షవర్గంలో అరటిచెట్లు, వస్తువర్గంలో శంఖం, పక్షివర్గంలో చక్రవాకాలు మొదలైనవన్నీ తావు చేసుకునే ఆ ఆకారవర్ణన ప్రకారం ఓ బొమ్మ వేయిస్తే భగవంతుడా! చలపతిని నువ్వే రక్షించాలి - అది ఆడబొమ్మలా వుండదు: అపహాస్యం కోసం గీసిన కార్టూనులా వుంటుంది..."

"చలపతేమో బపూను!

అతడి ప్రియురాలు కార్టూను!!"

విరగబడి నవ్వుకునేవారు మిత్రులందరూ!

వయసొచ్చిన ప్రతి వ్యక్తి తన బుద్ధి పరిపక్వతకు తగిన ఊహా లోకాన్ని తాను సృజించుకోవడం పరిపాటి. అందులో నందన వనాలు ఏడాది పొడుగునా చిగురించడం, పూచిన పువ్వులు వాడకుండా నిరంతరంగా సౌరభాలు వెదజల్లడం, గండు కోయిలలు మనోహర సుస్వరాలు వినిపించడం, మనసు ఆనందకరంగా వెన్నెలలు కాయడం, ఆ సుందర సీమలో మబ్బుల్లో తొలకరి మెరపు తీగలా ఎవడి ఊహాసుందరి వాడి అంతరంగంలో దోబూచు లాడడం - యివన్నీ లోక సామాన్యమైన విషయాలే! ఎటొచ్చీ బుద్ధిమంతు లందరూ తమ తమ ఊహా సుందరులను ఏడేడు పద్నాలుగు వాకిళ్ళ కవతల గర్భగుడిలాంటి జనానాలోపెట్టి తాళాలు బిగించుకుంటారు. అందుకు విరుద్ధంగా చలపతి ఆమెను తీసుకెళ్ళి నడివీధిలో రచ్చపైన కూర్చో బెట్టాడు!

లోకంలో నూటికి తొంభై మందికి వారి గొడవలతోనే వారికి సరిపోతుంది. మిగిలిన పదిమందిలో తొమ్మిదిమంది అవసరం వస్తేగానీ యితరుల విషయాల్లో జోక్యం పెట్టుకోరు. పోగా మిగిలిన వాడొక్కడున్నాడే. అతనికి ఇతరుల వ్యవహారాలు భోంచేస్తూ కాలం గడపడమే పని! ఈ ఒక శాతం మనుషులనందరినీ ఒకచోట చేర్చి ప్రత్యేకంగా వారి కొక సంఘం ఏర్పాటు చేస్తే దానికి కార్యదర్శి కాదగినవాడు రామనాథం!

సింహాద్రిపురం హైస్కూల్లో కాలుమోపిన ప్రతి కొత్త టీచరు జాతకాన్ని క్షణాల్లో గుణించి తన జేబులో పెట్టుకోడానికి అలవాటుపడ్డ రామనాథం చలపతితో తనకు పరిచయం కలిగిన రెండు రోజులకే అతణ్ణి గురించి వివరాలను పూర్తిగా ఆకళించుకున్నాడు. కాస్త కలిగిన కుటుంబంలో పుట్టినవాడు చలపతి. పట్టింపులకు, మూతి బిగింపులకు, మొండి సాధింపులకు ఆస్కారంలేని వాతావరణంలో పెరిగాడు. నిండుగా పండిన జొన్నచేనిలో వడిసెలరాయి దెబ్బతినని పిచ్చుక గువ్వలా పెరిగాడు. స్వగ్రామాన్ని వదిలిపెట్టి పట్టణాల్లో వుండి చదువుకున్న రోజుల్లో అతడు చదివిన కథలు, నవలలు, చూచిన నాటకాలు, సినిమాలు అతడికొక క్రొత్తలోకాన్ని నిర్మించి యిచ్చాయి. భావావేశం పొంగి

పొర్లినప్పుడల్లా అతడు అకారాన్ని బట్టి కవిత్వ మనిపించే రచనలు చేస్తుంటాడు. ఆ కవితలో ఎక్కువ భాగానికి ప్రణయమే వస్తువు. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం. అతడికొక ఊహా సుందరి వుంది. ఆవిడగా రెప్పుడో హఠాత్తుగా తన జీవన పథంలో ఎదురై, మందార దామంతో తన కంఠ సీమను అలంకరిస్తుందని ఈయనగారి నమ్మకం!

"ఇదిగోరా అబ్బీ, ఒకసారేం జరిగిందంటే... సింహాద్రిపురంలో పని చేస్తుండగా నాకు చలపతి అంటూ ఒక రూంమేటు వుండేవాడు..." అంటూ ప్రారంభించి ఒక రసవత్కథను చెప్పుకోడానికి వీలుగా పై వివరాల్లోనుంచీ ఒక పరిణామాన్ని సృష్టించగలిగితే ఎంత బాగుండును! అలాంటి అవకాశం కోసమే వేచి ఉన్నాడు రామనాథం!

❀ ❀ ❀ ❀

సింహాద్రిపురం ఉన్నత పాఠశాల స్టాఫ్ రూముల్లో మామూలు స్థాయికి మించిన అలజడి చెలరేగిందంటే అందుకు బహుశా క్రింద పేర్కొన్నవి కారణాలై వుంటాయి.

ఒకటి; అనుకోకుండా ఒక టీచరుకు ట్రాన్స్‌ఫర్ అయినా వచ్చి వుండాలి.

రెండు: హెడ్మాస్టరుగారు సహోపాధ్యాయుల ఆత్మాభిమానానికి దెబ్బతగిలేటట్టుగా ఏదో అక్రమచర్య అయినా తీసుకుని వుండాలి.

మూడు : ఇంక్రిమెంటల్ ఎరియర్స్ ద్వారా అయితేనేమి, టి.ఎ. బిల్లు లాంటిదేదైనా ప్యాసుకావడం వల్లనైతేనేమి ఒకానొక టీచరుకు అదనంగా కొంత డబ్బు ముట్టే సూచనలైనా పొడసూపి వుండాలి.

కానీ ఆనాడు అలజడి పతాకస్థాయికి చేరుకొనడానికి పైన పేర్కొన్నవి కారణాలు గావు.

జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సూపర్‌వైజర్లుగా ఆ స్కూలు టీచర్లలో నలుగురైదుగురిని నియమించినట్టు ఆరోజు టపాలో ఉత్తర్వులు వచ్చాయి.

ఆ నలుగురైదుగురిలోనూ చలపతి ఒకడు!

చలపతిని పోస్టుచేసిన చోటు ఒక పెద్ద పట్టణం. అక్కడి విద్యార్థులు ప్రాచీన దుస్సాంప్రదాయాలపైకెత్తిన విప్లవపు బావుటాలు. 'దేశ సౌభాగ్యాన్ని తలా కొంచెం పంచుక తినడం సబబంటున్నారు. గదా! మరైతే మార్కుల విషయంలో మీరా న్యాయాన్ని ఎందుకు పాటించరు? ఒక విద్యార్థికి దెబ్బయిలు, ఎనభైలు ప్రసాదించి, ఇంకొక విద్యార్థికి అదే చేతితో బిచ్చం పెట్టినట్టుగా పదిమార్కులో లేదా ఇరవై మార్కులో పడవేయడానికి మీకెలా మనసొప్పుతుంది? ఈ దురన్యాయాన్ని మేము సహించం! హక్కులు సమానంగా వర్తించేదాకా విశ్రమించం!" అంటూ వాళ్లు నడుము బిగించి, విద్యావ్యవస్థతో పరోక్షయుద్ధం కొనసాగిస్తున్నారు. హక్కులందరికీ సమానంగా .వర్తించడం మంచి మాటే! కానీ, విధులమాట ఏమిటి? అంటూ వాళ్ళ నెదిరించి ప్రశ్నించావో, నీకు కీడు మూడిందన్న మాటే! ఎందుకంటే అక్కడి విద్యార్థుల్లో కొందరు అడ్వకేట్ల ముద్దుబిడ్డలు. మరికొందరు జిల్లా అధికారుల సత్సంతానాలు. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకున్న అనధికార ప్రముఖులతో ఏదో విధంగా బీరకాయ పీచు బాంధవ్యం కలిగి వున్నవారు కొందరు. వారిలో ఏ ఒక్క కుర్రాడు గట్టిగా పట్టు పట్టినా, ఉపాధ్యాయుడు సుడిగాలిలో ఎండుటాకు.

అందుకనే శ్రేయోభిలాషు లందరూ చలపతికి చక్కగా హితవు చెప్పిగానీ వదిలి పెట్టలేదు. "అబ్బాయ్ చలపతీ! నువ్వు నిన్నగాక మొన్న బియ్యాడి ప్యాసయ్యావు. పిల్లకాకికి వుండేలు దెబ్బ తెలియదు. పరీక్ష హాల్లో చిత్తుకాగితాలను పసిగట్టడం, జేబుల్లో చేయి వేయడంలాంటి పాడు పనులు తలపెట్టవద్దు. కళ్ళుండీ చూడకుండా, చెవులుండీ వినకుండా, గ్రుడ్డిగా, చెవిటిగా, అమోఘంగా నటించగల త్యాగమొక్కటే ఈ రోజుల్లో ఉపాధ్యాయుడికి రక్షణ కవచం! భద్రం, భద్రం, ఖబడ్దార్–" అని మరీ మరీ హెచ్చరికలు చెప్పి స్నేహితులు చలపతిని బస్సెక్కించారు.

అందరిలోనూ చలపతి లౌకిక జ్ఞానంపట్ల నమ్మకం లేనివాడు రామనాథం ఒక్కడేః స్వప్రయోజకత్వాన్ని వెలిగించే పనులేవో చేసి ఈ బుద్ధిమంతుడు ముప్పుతెచ్చుకోక పోడని తన అంతర్వాణి తన కదే పనిగా చెబుతుండగా, పైకి మాత్రం ముసిముసి నవ్వులు నవ్వుతూ చలపతికి వీడ్కోలు చెప్పాడు రామనాథం.

బస్సు కదిలింది.

వారం రోజులు గడిచాయి.

చలపతి తిరిగి వచ్చాడు.

తిరిగి వచ్చిన చలపతిని నఖశిఖ పర్యంతమూ పరీక్షచేసి చూసేశాడు రామనాథం! ఆశ్చర్యం, మహదాశ్చర్యం, అతడి కాళ్లూ చేతులు పదిలంగానే వున్నాయి. తలపైన బొప్పెలు లేవు. కనీసం పలువరసలోనైనా ఖాళీ కనిపించడం లేదు! పైగా విచిత్ర మేమిటంటే, తనేదో రాజ్యాన్ని జయించినట్టు అతగాడి పెదవులపైన మందహాస జ్యోత్స్నలు!

"ఏమిటోయ్ చలపతీ! ఏం జరిగింది బాబూ! వివరంగా చెప్పవూ?" ఏకాంతంలో మిత్రుణ్ణి ప్రశ్నించాడు రామనాథం.

"ఉందిలేవోయ్! కథ చాలా వుంది" అన్నాడు చలపతి.

"నాకా అనుమానమైతే నీ ముఖాన్ని చూడగానే కలిగింది! ఏమిటాకథ?" ఉత్కంఠను ఒలకబోశాడు రామనాథం.

"మరేంలేదు. ఓ అమ్మాయి, అమ్మాయేమిటి – సాక్షాత్తుగా నా ఊహా సుందరి. కళ్లు, చెవులు, ముక్కు నడుము – అన్నీ కచ్చితంగా అచ్చుగుద్దినట్టు నేనూహించినదే! పేరేమిటో చెప్పనా, రాజీవ!"

రామనాథం తెల్లబోయాడు. వీడున్న వాడున్నట్టు వూరుకోక సాయంకాలాల్లో పట్టణం శివార్లలో ఎక్కడైనా పరిభ్రమించాడా ఏమిటి కర్మ!

చలపతి చెప్పుక పోతున్నాడు –

"రూం నెంబరు పన్నెండుకు వేశారు నన్ను! మొదటిగంట కొట్టేశారు. రెండోగంట కూడా మ్రోగింది. ఐనా ఒక్క డస్కు మాత్రం ఇంకా ఖాళీగానే వుంది. అరగంట గడచిన తర్వాత ఓ అమ్మాయి ఒగర్చుకుంటూ పరతెంచి వచ్చింది. చీఫ్ సూపరింటెండెంటుగారు ఆమెను తీసుకొచ్చి నా కప్పగించారు. చూడగానే పోల్చుకున్నాను. "అస్మదీయ మనస్సామ్రాజ్య పట్టమహిషీ! నువ్విక్కడున్నావా? అనుకున్నాను. మరేం భయపడవలసిన అవసరం లేదని బుజ్జగించి కొశ్చన్ పేపరులోని ప్రశ్నలన్నీ ఒకసారి చదివి చెప్పి, ఉన్న

యిరవై ప్రశ్నల్లో పది ప్రశ్నలు కరెక్టుగా వ్రాసినా ప్యాసైపోవచ్చు నన్నాను. నేను ధైర్యం చెప్పిన మీదట ఆమె నింపాదిగా కలం చేతికి తీసుకుంది. మధ్యలో ఒకసారి నా ఫ్లాస్కు పంపించి ఆమెకోసం కాఫీ తెప్పించాను. వద్దు వద్దంటూనే గ్లాసుకోసం చేయిచాచింది. ఆ రోజు వెళ్తూ వెళ్తూ ఆమె ఎంత ఆప్యాయంగా థ్యాంక్స్ చెప్పిందనుకున్నావు రామనాథం! అంతకంటే మాట్లాడడానికి అవకాశంలేదు. అయినా ఆమెనలా చూస్తూ వుండిపోవడంలోనే కోటి ఆనందాలు నిక్షిప్తమైలేవా! ఆ గదికి రెండుసార్లు మాత్రమే వేశారు నన్ను! రెండోసారి వెళ్ళినప్పుడు ఆమె నావైపు అలా వోరగా చూచిన చూపు! ఆ ముఖ భంగిమ మరచిపోదామన్నా మరపు రాదు. అంతటితో నేను తృప్తిపడి వచ్చేశా ననుకోకు! ఆమె ఎవరో, ఏమిటో వాకబు చేసి తెలుసుకున్నాను. కృష్ణమందిరం వీధిలో శ్రీనివాసమూర్తి అంటూ ఓ డాక్టరు వున్నాడు. అతని కీమె పిన్నమ్మ కూతురు. తలిదండ్రుల్లో తల్లి మాత్రమే వుంది. అన్నదమ్ముళ్లుగానీ, అక్కచెల్లెళ్లుగానీ లేరు. ఆ వ్రేలు విడిచిన అన్నగారి యింట్లో వుండి హైస్కూల్లో చదువుకుంది. పల్లెలో కొద్దిగా భూమి, పుట్రా వున్నాయట! నీకు చెప్పానే లేదో జ్ఞాపకం లేదు. మళ్ళీ ఒకసారి స్మరిస్తే తప్పేముందిలే! ఆమె పేరు రాజీవ!"

'ఓరి మూఢజీవా! ఇంతచేసి నీ కథ ఈపాటిదేనా!" అనుకున్నాడు రామనాథం. మునుపు ఇలానే ఒక మూర్ఖుడికి దారంట వెళ్తుంటే ఓ లాడం దొరికిందట! ఇంక మూడు లాడాలు, ఒక గుర్రమూ దొరికితే ఎంచక్కా సవారీ తీయవచ్చు – అనుకున్నాడట! చలపతి ఆశాభావం అంతకన్నా మెరుగ్గాలేదు.

కానీ ఈ ఉబలాటాన్నీ ఆధారంగా వుంచుకొని చలపతిని ఏడిపించడానికి ఇదొక చక్కని అవకాశం మాత్రంగాక పోదు.

రామనాథం బుర్ర యంత్రంలా పనిచేయడం మొదలెట్టింది. ఆ రాత్రి గడిచి తెల్లవారేసరికి పథకం సిద్ధమైంది. ఆ పథకంలో నుంచీ నాలుగు కాలాలపాటు అదొక గమ్మత్తుగా చెప్పుకోదగిన విచిత్ర పరిణామం పుట్టుకొచ్చింది.

రామనాథం సవ్యసాచి. ఎందుకైనా పనికొస్తుందని ఎడమచేతితో కూడా దస్తూరీ పొంకంగా వ్రాయడానికి తరిఫీదు చేసి పెట్టుకున్న తన హస్తలాఘవాన్నంతా ఉపయోగించి అతడొక లేఖను తయారు చేశాడు.

"ప్రియమైన మేష్టరుగారూ!

"నమస్కారాలు. పరీక్షల గొడవల్లో మీతో మాట్లాడడానికే వీలు లేకపోయింది. పరీక్షలైపోయాక కనిపిస్తారేమో ననుకున్నాను. నా ఆశ అడియాసే అయింది. మీ మంచితనానికి నేనెంతో ఋణపడి వున్నాను. మీరే గనక లేకుంటే నేను నా పరీక్షను ధైర్యంగా ఎదుర్కొనేదాన్నిగాను. మళ్ళీ ఒకసారి మిమ్మల్ని కలుసుకోవాలని ఉంది. మీరు సింహాద్రిపురంలో ఉద్యోగం చేస్తున్నారని తెలిసింది. సింహాద్రిపురం ఇక్కడికి పదిహేను మైళ్ళేనట! మీరు తలుచుకుంటే ఇదొక దూరం కాదు. బుధవారం సాయంకాలం అయిదు గంటలకు మీకోసం మునిసిపల్ పార్కులో వేచివుంటాను. ఆశాభంగం కలిగించరని నమ్ముతున్నాను.

ఇట్లు
రాజీవ."

రామనాథానికి ముందుచూపు ఎక్కువ. తాను చేస్తున్న పని మూలంగా తానెవ్వరికీ పట్టుబడి పోకూడదు. కానీ జరగవలసిన హంగామా మాత్రం పూర్తిగా జరగాలి. అందుకని అతడు బడికి రెండు రోజులు సెలవు పెట్టాడు. స్వగ్రామానికి వెళ్తున్నానని చెప్పాడు నేరుగా పట్టణానికే వెళ్ళి సినిమాలు, తదితర వ్యాపకాలతో కొంత కాలక్షేపంచేసి తిరిగివస్తూ ఉత్తరాన్ని తపాలా పెట్టెలో పడవేసి వచ్చాడు.

చెరువు నీటిలోనికొక బండరాతిని త్రోసివేయడం జరిగింది. ఇక తమాషా చూస్తూ గట్టుపైన కూర్చోడమే తన పని. చలపతికి ఉత్తరం బట్వాడా అయిన క్షణంనుంచీ అతడి ముఖకవళికల్ని పరిశీలించడమే పనిగా పెట్టుకున్నాడు రామనాథం. చలపతి ఉత్తరాన్ని ఒకసారి చదివాడు. రెండుసార్లు చదివాడు. దూరంగా వెళ్ళి ఓ చెట్టుచాటున నిల్చుని పద్యాన్ని కంఠస్థం చేసుకునే విద్యార్థిలా ఆ ఉత్తరాన్ని అలాగే హృదయగతం చేసుకున్నాడు. అతడి బుగ్గలు బూరెల్లా పొంగిపోయాయి. కళ్లు మతాబాల్లా కాంతులు చిమ్మసాగాయి. నిల్చున్నచోట నిల్చోలేక, కూర్చున్నచోట కూర్చోలేక, ఎదురైనవారితో ఎలా మాట్లాడాలో తోచక మహదానందంలో అతడు తబ్బిబ్బు పడిపోతున్నాడు.

"ఏమిటోయ్ చలపతీ! ఆకాశానికి మూడే బారలన్నంత ఉత్సాహంగా వున్నావే! ఏమిటికథా?" ముభావాన్ని నటిస్తూ అడిగాడు రామనాథం.

"అబ్బే. ఏముంది, ఏం లేదు" అంటూ తప్పించుకున్నాడు చలపతి.

చేయి తిరిగిన వేటగాడిలా గురి చూచి ఎక్కడ కొట్టాలో అక్కడే కొట్టాడు రామనాథం. అతడి అంచనా కించిన్మాత్రమైనా తప్పిపోయిందిగాదు. నాలుగో పీరియడు జరుగుతుండగానే చలపతి హెడ్మాస్టరుగారి గదిలో ప్రవేశించాడు. తన తాతగారు చావుబ్రతుకుల మధ్య తల్లడిల్లిపోతున్నట్టు వర్తమానం అందిందనీ బుకాయించాడు. సెలవు మంజూరయింది. రామనాథం గదికి వెళ్ళేసరికి చలపతి ముస్తాబు పూర్తి చేసుకుని ప్రయాణానికి సిద్ధంగా వున్నాడు.

"మీ తాతగారికి నువ్వొక్కడివే మనవడివా చలపతీ!" సానుభూతిని ప్రకటిస్తున్న దైన్యస్వరంతో అడిగాడు రామనాథం.

చలపతికా పరామర్శ స్పష్టంగా వినిపించినట్టు లేదు. "అవునవును. ఒంటిగంటకే బస్సు. ఆలస్యం చేస్తే అది కాస్తా దాటిపోతుంది" అంటూ అతడు రోడ్డువైపు దౌడుతీశాడు.

"పోరా బాబూ పో!" అనుకున్నాడు రామనాథం. పోయి చూస్తేగానీ మున్సిపల్ పార్కులో చెట్లు కనిపించవు. అయ్యగారి వాలకం చూస్తే మూడుమూడున్నరకే పార్కులోకి చేరుకునే టట్టున్నాడు. గంట అయిదవుతుంది. ఆరవుతుంది. ఏడుదాటుతుంది. రాజీవ కనిపించదు. అయ్యగారికి నడ్డి నీలుగుతుంది. కళ్ళు నొప్పెడతాయి. ఆకలి కాదు. అన్నం సయించదు. సినిమాకి వెళ్ళాలనిపించదు. నిద్రపట్టదు. తెల్లవారేసరికి మూడు మాసాలు కాయిలాపడి లేచినంత నిస్సారంగా వుంటుంది. ఇంత చేశావా భగవంతుడా అనుకుంటూ శరీరాన్ని బస్సులోకి జేరవేసి తిరుగుదారి పట్టవలసి వస్తుంది...

తిరిగిరాగానే చలపతిని ఎలా పలకరించాలన్నది రామనాథం యొక్క ప్రస్తుత జిజ్ఞాస! "అయ్యో పాపం, నువ్వు వెళ్లేసరికి మీ తాతగారు పోయారా ఏమిటి చలపతీ!" అనడం సముచితంగా వుంటుంది.

"ఇంతకూ జబ్బేమిటో చెప్పావుగాదు" అనడం రెండో మెట్టు.

ఇలా మెట్టుపైన మెట్టు కట్టుకుంటున్నాడు రామనాథం. రాత్రి గడచి, తెల్లవారింది.

ఏడు ఏడున్నరకల్లా తిరిగి రావలసినవాడే చలపతి. గంట తొమ్మిది కావచ్చినా అజాపజా లేదు. పది గంటలకు బడి గూడా ప్రారంభమైంది. క్లాసులకు వెళుతున్నాడన్న మాటేగాని రామనాథం మనసు పిల్లలపైన లగ్నమై వుండడం లేదు. చలపతి ఏమైనట్టు? ఇంకా పట్టణంలో ఏం చేస్తున్నట్టు?

ఒంటి గంటకు బడినుంచి అలాగే మెస్‌కు వెళ్ళి, భోజనంచేసి రూముకు చేరుకున్న రామనాథానికి వాలుకుర్చీలో మేనువాల్చి, కాళ్ళను కిటికీలోకి చాపి కూనిరాగం తీసుకుంటున్న చలపతి కనిపించాడు. గోడకు తగిలించిన అద్దంలోనుంచే మిత్రుని రాకను గమనించినట్టున్నాడు చలపతి. మరుక్షణంలో అతడు పెద్ద పెట్టున నవ్వడం వినిపించింది. నవ్వి నవ్వి "నా కెక్కడ తాతగారోయ్ రామనాథం, అదంతా వట్టిమాట! వేరొక పనిబడి నేను టౌనుకు వెళ్ళొచ్చాను" అన్నాడు.

"అరరే! అదేమిటి చలపతీ!" సహజస్వరంతో ప్రశ్నించగలిగాడు రామనాథం.

"ఇప్పుడు గాదులే! తీరిగ్గా సాయంకాలం చెబుతాను" అన్నాడు చలపతి.

అపరాహ్ణంపూట బడి రెండు గంటలకు ప్రారంభమౌతుంది. అయిదు కొట్టక మునుపే పూర్తవుతుంది. ఆ మూడు గంటలసేపు రామనాథానికి ముళ్ళపైన కూర్చున్నట్టే వుంది. మనసులో మనసు లేదని చెప్పడం అతిశయోక్తిగాదు. బ్రేకులు చెడిపోయి బోల్తా కొట్టవలసిన బండి, అలాగే విమానంలా పైకెగిరి వెళ్ళిపోతుందా? ఇదేం విడ్డూరం!

చల్లటి సాయంకాలంవేళ, చెరువు కడుపున పచ్చని పట్టుపైన దొరికిన ఏకాంతాన్ని భంగపరుస్తూ ప్రారంభించాడు చలపతి:

"నిజంగా యేం జరిగిందంటే రామనాథం! రాజీవ నాకు జాబు వ్రాసింది."

"అలాగా! ఏమని వ్రాసింది చలపతీ! ఏదీ, చూపెట్టు చూద్దాం..."

"చూపెట్టడానికది నా దగ్గ రెక్కడుంది? రాజీవకే యిచ్చేశాను. మళ్ళీ అడిగి తీసుకోడానికి జ్ఞాపకం వుండొద్దూ! ఐనా ఒక జాబేం కర్మ! ఇకపైన మన పైకి ప్రజలను లేఖల పరంపరే ప్రారంభం కావచ్చు..."

"ఓరి నీ యిల్లు బంగారం గానూ! కాస్త విశదంగా చెప్పలేవా చలపతీ!..."

తన ఆనందంలో తానుండిపోవడంవల్ల చలపతి గమనించడం లేదంతే గానీ, రామనాథం ముఖంలో కత్తివేటుకు నెత్తురు చుక్కలేదు.

చలపతి కొనసాగించాడు–

తానేమో అయిదుగంటలకే మునిసిపల్ పార్కు చేరుకున్నాడు. గంట ఆరయింది. ఆరున్నరకావచ్చింది. రాజీవ కనిపించలేదు. అదేపనిగా జాబు వ్రాసి తనను రమ్మన్న రాజీవ ఆ విషయాన్ని సుతరామూ మరచిపోగలదంటే ఎలా నమ్మడం? ఏమో పరీక్షకే అరగంట ఆలస్యంగా రాలేదా? ఇప్పుడు గూడా అలాగే జాగు చేస్తున్నదేమో! ఎందుకైనా మంచిదని అలా కాళ్ళీడ్చుకుంటూ తాను కృష్ణమందిరంవైపు బయల్దేరాడు. ఆ వీధిలో నాలుగో యిల్లే డాక్టర్ శ్రీనివాసమూర్తిది. ముందరి వైపు డిస్పెన్సరీ, వెనుకభాగంలో

కాపురం. అంతగా ఎవరైనా తర్కించి అడిగితే డాక్టరుగారికోసం వచ్చినట్టు చెప్పవచ్చు. ఆ సమయానకేదో ఒక జబ్బు స్ఫురించకపోదు. అలాంటి ఆలోచన కలగగానే తాను తటపటాయించకుండా లోపలికి అడుగుపెట్టాడు. వెళ్ళిన సమయానికి డాక్టరుగారు యింట్లో లేరు. రోగులు వేచివుండడం కోసం వేసివున్న బెంచిపైన కూర్చున్నాడు. తాను కూర్చున్న నడవలోనుంచే యింటి వెనుక భాగానికి దారి వెళ్తుంది. లోపలికి వెళ్ళడానికా తనకు చొరవ చాలడం లేదు. ఇప్పుడు గాకపోతేమానే, మరికొంతసేపటికైనా రాజీవ కనిపించవచ్చునన్న ఆశాభావం సన్నగిల్లడంలేదు. అలాగే ఓ అరగంట గడిచింది. అంతలో ఓ మూడేళ్ళ పసిపాప కాళ్ళకు తొడిగిన గజ్జెలు ఘల్లు ఘల్లుమంటుండగా అటువైపు రావడమేమిటి, "చిట్టి చిట్టీ, రోడ్డుపైకి వెళ్ళకు" అంటూ ఆ పసిపాప వెంట రాజీవ పరుగెత్తుకుంటూ రావడమేమిటి, ఆమె తన వైపు, తానామెవైపు చూడడమేమిటి అన్నీ ఒక్కసారిగా జరిగిపోయాయి.

"నమస్కారమండి మేష్టరుగారూ! చాలా దూరం వచ్చేశారే!" అంది రాజీవ. నిజం చెప్పద్దూ, తనకు ఒళ్లు మండింది. తన కోపాన్ని తాను లోలోపలే అణుచుకున్నాడు.

"మిమ్మల్ని గురించి మా అమ్మతోనూ, అన్నగారితోనూ చెప్పాను. ఒకవేళ నేను పరీక్షలో ప్యాసయితే అదంతా మీ చలవే నన్నాను. అలాగైతే ఆయన నొకసారి మనయింటికి రమ్మనలేక పోయావా అంది మా అమ్మ. దేవుడు త్రోసుకొచ్చినట్టుగా మీరే వచ్చేశారు. అయినా ఒక మామూలు రోగిలాగా మీరిక్కడ కూర్చోడమేమిటి? అన్నగారితో చెప్పి మీకు స్పెషల్ ట్రీట్‌మెంట్ యివ్వమంటాను గానీ, యిలా లోపలికి వచ్చి కూర్చోండి మేష్టరుగారూ!"

రాజీవను ముక్కు పట్టుకుని పిండేయాలన్నంత వుక్రోషం వచ్చింది తనకు! తగుదునమ్మా అంటూ ఈవిడ తనను రమ్మని ఉత్తరం వ్రాసింది. పార్కులో కనిపించకపోతే తానిల్లు వెదుక్కుంటూ రాకపోడని ఈ ఎత్తు వేసింది. తీరా వచ్చేశాక బహుశా భగవంతుడే తనను త్రోసుకుని వచ్చి వుంటాడనీ, లేదా డాక్టరుగారితో పనిబడి వచ్చి వుంటాననీ భావిస్తున్నట్టుగా నటిస్తూ దాగుడుమూత లాడుతోంది.

గదిలోకి వెళ్ళి కూర్చున్న అయిదు నిమిషాలకు రాజీవ లోపలికి వచ్చింది. జగ్‌లోనుండి కాఫీని కప్పులోకి వంచుతూ "తీసుకోండి మేష్టారూ!" అంది.

"స్వాగత సత్కారాలు బాగానే వున్నాయిగానీ దీని సంగతేమిటి?" అంటూ తన జేబులో వున్న వుత్తరాన్ని తీసి బల్లపైకి విసిరాడు.

అప్పటికి తాను వ్రాసిన వుత్తరమే తనకు గుర్తు లేనట్లుగా తదేక దృష్టితో దానివైపు చూడసాగింది రాజీవ.

"బాగుందిలే వరస! ఆ జాబు కెక్కడైనా దృష్టిదోషం తగిలేను!" అన్నాడు తాను.

"అలాగైతే పార్కులో నేను కనిపించక పోయేసరికి మీరిలా వచ్చేశారు. అంతేనా మేష్టారుగారూ!" ఆమె సూటిగా ప్రశ్నించింది.

"గెస్ చేసినా ఆన్సరు మాత్రం కరెక్టుగా చెప్పావు. నూటికి నూరు మార్కులు నీకు!"

ఇంతలో ఒక ముసలావిడ ద్వారందగ్గిర ప్రత్యక్షమైంది. "నేను చెప్పానే. ఆ మేష్టరుగారు ఈయనేనమ్మా!" అంటూ రాజీవ తల్లికి తనను పరిచయం చేసి పెట్టింది. ఆ ముసలావిడ తనవైపు ఎగాదిగా చూచింది. అయిదు నిమిషాల్లో తన పుట్టు పూర్వోత్తరాలంతా వాకబు చేసి తెలుసుకుంది. తన తల్లి పుట్టిల్లూ, వాళ్ళ మేనమామగారిల్లూ ఒకటేనని కనిపెట్టింది. "అయ్యో! మా సీతాలక్ష్మి కొడుకువా నాయనా! నేనింకా ఎవరో అనుకున్నాను. అమ్మాయ్! వేళ గానీవేళ కాఫీ ఏమిటి? కాళ్ళు కడుక్కోమని విస్తరి వేస్తే సరిపోలా?" అని పురమాయిస్తూ లోపలికి వెళ్ళింది.

ఆ యిద్దరి మాటకేంగాని, డాక్టరు శ్రీనివాసమూర్తి మరింత కలుపుగోలు మనిషి. తన చదువూ, సంస్కారాలూ, ప్రవర్తన అతడికెంతగానో నచ్చాయి. మాటల సందర్భంలో రాజీవకు వివాహ ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పాడు. తానుగూడా వస్తూ వస్తూ పోస్టాఫీసుకు వెళ్ళి వూరికొక వుత్తరం వ్రాసి వచ్చాడు. వారం పదిరోజుల్లో అమ్మా, నాన్నా యింకా తన వైపు పెద్దలందరూ వచ్చి అమ్మాయిని చూచుకుంటారు. మాటా పలుకూ కుదిరితే వెంటనే పెళ్ళికి ముహూర్తంగూడా పెట్టుకుంటారు."

అదీ కథ!

"చూచావా రామనాథం! తొలి చూపులోనే వలపు అంటే అది సినిమాల్లోనే కాని జీవితంలో జరగదనుకుంటాం! నా విషయంలో అది నిజమైంది. కాకపోతే పదిహేను రోజులప్పుడు రాజీవ కనిపించడమేమిటి, ఈ స్వల్ప వ్యవధిలోనే పరిణామాలు పెళ్ళిదాకా రావడమేమిటి?" అంటూ ఒక ఆశ్చర్యార్థకంతో ముగించాడు చలపతి.

రామనాథం అడగలేదు గాని, అడిగి వున్నట్టయితే ఆకాశానికి మూడు బారలేమిటి, రెండు బారలేనని అనేటట్టున్నాడు చలపతి.

❁ ❁ ❁ ❁

సమాజంలో పెళ్ళిళ్ళు జరగడం మామూలే! కానీ ఏ వ్యక్తి జీవితంలో ఆ వ్యక్తి ఒక మరపురాని సంఘటన నవయౌవన ప్రారంభదశ దగ్గిరినుంచే చిత్తంలో వివాహాన్ని గురించిన కోరికలు ఈరికలు తొడగడం సహజం. రామనాథానికి మూడేళ్ళనుంచి వివాహ ప్రయత్నాలయితే ఏకధాటిగా జరుగుతూనే వున్నాయి. అలాగని అతడేమంత హిరణ్యాక్ష వరాలు కోరుతున్నాడనుకోరాదు. అమ్మాయి అందచందాలను గురించైనా రామనాథానికి పట్టింపులేదు. ఎటొచ్చీ తల్లిదండ్రుల కొకతే కూతురైవుండి అందువల్ల ఒకటి రెండు లకారాలు కలిసి వచ్చే సంబంధాలపైన అతడి మొగ్గు, లోకంలో అలాంటి సంబంధాలు బొత్తిగా లేకపోలేదుగానీ, వాళ్ళ కన్నివిధాలా రామనాథానికంటే మెరుగైన అబ్బాయిలే తారసిల్లేవారు.

లోలోపల ఎంత గుబులుగా వున్నా "అబ్బే, పెళ్ళికిప్పుడేం తొందర?" అని రామనాథం చెప్పడంలేదా? చెబుతున్నాడు.

పులిమీద పుట్ర ఏమిటంటే అలాంటి రామనాథం తప్పనిసరిగా చలపతి పెళ్ళికి వెళ్ళవలసి వచ్చింది. దాన్ని విధివిలాసమన్నా అనవచ్చు. విధి వైపరీత్యమన్నా అనవచ్చు.

చలపతికి పెళ్ళి జరిగినా జరిగిందిగానీ, అది ఎవరూ అనుకోనంత ఘనంగా జరిగింది. పట్టణంలో వున్న కార్లన్నీ పెళ్ళివారింటి చుట్టూ మూగిపోయాయి. పట్టరానంత జనస్తోమంతో పెళ్ళి జరుగుతున్నచోటు పుష్పకవిమానంలా తయారైంది. కదిరి మల్లె పూలతోనూ, కమలాపురం గులాబీలతోనూ గుబాళించి పోతున్న పెళ్ళి మంటపంలో వధూవరులకు వచ్చిన కానుకలే కన్పిస్తున్నాయిగానీ, వధూవరులు కనిపించడంలేదు.

పెళ్ళి పీటపైన కూర్చున్న చలపతికి వివాహానికి హాజరైన మిత్రులనందరినీ ఒకసారి పరికించడానికైనా వీల్లేకపోయింది. పీటలపైన్నుంచి లేవడమే తడవుగా భోజనాలు ప్రారంభమయ్యాయి. రామనాథం భోజనం చేశాడా? తాంబూలం వేసుకున్నాడా? అని చలపతి వాకబయితే చేశాడుగానీ, చేసే వుంటాడు. తీసుకునే వుంటాడు. అంటూ రుజువులేని సమాధానాలే వినవచ్చాయి.

మళ్ళీ సింహాద్రిపురం హైస్కూల్లోనేగానీ, చలపతికి రామనాథం కనిపించలేదు.

చలపతి మిత్రుణ్ణి గాఢాలింగనం చేసుకున్నాడు. పెళ్ళి కబుర్లతో హోరెత్తించేశాడు. చిట్టచివర "నేనిక నీ రూంలో నీతో కలిసి వుండడం గూడా కొద్దిరోజులేనోయ్ రామనాథం! మునసబు రామిరెడ్డిగారు అవుట్ హౌస్ ఖాళీచేసి నాకిస్తామన్నారు" అన్నాడు.

వీలయినంత నిర్లిప్తంగానే ఆ కబుర్లు నన్నింటినీ విన్నాడు రామనాథం. వివాహంతో విద్యకు ఫుల్‌స్టాపేనంటారు. అలాగే ప్రణయానికి ముగింపు పరిణయము. చలపతి ప్రణయగాథకూడా ఇంతటితో ఆఖరేనన్న ఓదార్పు ఒక్కటే మిగిలింది రామనాథానికి!

❁ ❁ ❁ ❁

క్రొత్త కాపురం ప్రారంభమైన క్రొత్తలో సింహాద్రిపురంలోని మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఒక విందు ఏర్పాటు చేశాడు చలపతి. ప్రముఖ గెస్టు హోదాలో గాకపోయినా, ప్రత్యేక గెస్టు హోదాలో ఆ విందుకు హాజరయ్యాడు రామనాథం. "చెప్పాను గదూ! ఈయనే రామనాథం. నా రూం మేటు. మా ఇద్దరి మధ్య దాపరికాలు లేవు" అంటూ మిత్రుణ్ణి భార్యకు పరిచయంచేసి పెట్టాడు చలపతి. "అలాగా! నమస్కారమండీ!" అంది రాజీవ. అంటూ ఆమె తనవైపు చూచిన చూపులో రామనాథానికి ఎక్స్‌రే లక్షణాలు పొడసూపాయి. ఆ కారణంగా అంతటి చల్లటివేళ ముచ్చెమటలు పోయబోతున్నట్టుగూడా అనుమానం కలిగింది. సూత్రధారిగా వుండి తానొక నాటకం నడపదలచుకున్నాడు. రాజీవ తనకా అవకాశం దక్కనివ్వలేదు. చలపతి చూపెట్టిన జాబు తాను వ్రాసింది కాదన్న విషయం ఈ యిలాతలంపైన ఒక్క రాజీవకు మాత్రమే నిష్కర్షగా తెలుసు. తెలిసిన తర్వాత ఆ వ్యక్తికోసం అన్వేషణ సల్పకుండా వుండడం మానవ స్వభావాలకే విరుద్ధం!

అతిథులందరూ విందు పసందుగా వుందనుకున్నారు. కానీ రామనాథానికి మాత్రం ఆ విందు మందుకన్నా హితవుగా లేదు.

ఫల పుష్ప తాంబూలాలతో గూడిన కాగితపు బంగీలు స్వీకరించి అతిథులొక్కరొక్కరే వెలుపలికి వచ్చేశారు.

తలుపులు తీసి చీకటి గదిలో కాలు మోపాడు రామనాథం. ఎందుకోగానీ అతనికి లైటు వేయాలనే అనిపించలేదు. పైపెచ్చు జుత్తును చిందరగా వందరగా పీక్కుని, గోళ్ళతో ముఖాన్ని వికృతంగా బరుక్కోవాలనిపించింది. కాకపోతే తాను చేసిన చిన్న పొరపాటు తననిలా వెక్కిరిస్తుందా? తన ఎదుట కేవలం ఒక అర్భకుడుగా మాత్రమే పరిగణింపదగిన చలపతికి రంభలాంటి పెళ్లామా? వ్రేలి వ్రేలికి ఉంగరాలా?

మరనొక్కి దీపం వెలిగించాడు రామనాథం. ఆ వెలుతురులో తన చేతివైపొకసారి చూచుకున్నాడు. అబ్బే, ఏముంది, తన చేతిలో ఏమీ లేదనుకున్నాడు. లేకపోతే తానొక కార్టూన్ గీయదలచుకుంటే అదొక అందమైన త్రివర్ణ చిత్రంగా రూపొందుతుందా? చివరకు జీవితం తననే ఒక అప్పటమైన కార్టూనుగా మార్చి వేస్తుందా?

పడక పరచుకోడానికైనా ఓపికలేక, అలాగే కాసేపు నేలపైన వాలిపోయాడు రామనాథం. క్రిందికి వేసికొట్టడంలో ప్రిదిలిపోయిన కాగితపు బంగీలోనుంచి ఈవలికి జారిన చిన్న కాగితం ముక్క ఒకటి అతనికి నేలపైన కనిపించింది.

కంగారుగా ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకున్నాడు రామనాథం. అందులో ముక్తసరిగా నాలుగైదు వాక్యాలు మాత్రమే వున్నాయి-

"నువ్వొకరికి మేలు చేయాలనుకుంటావు. అది కీడు కావచ్చు. నువ్వొకరికి కీడే చేయాలనుకుంటావు. అది మేలు కావచ్చు. అలాంటి సమయాల్లోనే జీవితం నిన్ను పరిహసించేది. నరుడా, వానరుడు కాకుము!"

❁ ❁ ❁ ❁

అది జనరల్ ట్రాన్స్‌ఫర్లు జరుగుతున్న సమయం కాదు. కానీ ఉన్నట్లుండి రామనాథానికి ఎందుకు బదిలీ వచ్చిందో చలపతికి తెలిసిందిగాదు. వచ్చిందిపో, వెంటనే పెట్టె, పరుపూ సర్దుకుని అతడంత తొందరగా సింహాద్రిపురాన్ని వదిలిపెట్టి వెళ్ళడం గూడా చలపతికి కాస్త విడ్డూరంగానే కనిపించింది!

♦ *'జ్యోతి' దీపావళి సంచిక* - ***1965*** ♦